క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని స్వామి అయ్యప్ప దేవాలయంలో గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శబరి విద్యానికేతన్, అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. అయ్యప్ప జయంత్యుత్సవాల సందర్భంగా పోటీలు నిర్వహించినట్టు శ్రీ మణికంఠ జ్యోతి భక్త సేవా సంఘం అధ్యక్షుడు ఎస్.ఆర్.వైద్యనాథన్, కార్యదర్శి టి.నూకినాయుడు, కోశాధికారి పి.అప్పలరాజులు తెలిపారు. శుక్రవారం స్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో భారీ అన్నసమారాధన నిర్వహించడంతో పాటు పోటీల విజేతలకు బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు. సేవా సమితి అధ్యక్షుడు ఆదపాక వెంకటరమణ, నంబారు రాజు తదితరులు పోటీలను పర్యవేక్షించారు.

ఘనంగా హోమియోపతి దినోత్సవం


డాక్టర్ హానిమన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ శ్రీదేవి, గ్రామ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హానిమన్ జయంతిని సందర్భంగా గురువారం ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని 68వ వార్డు మింది ప్రభుత్వ హోమియోపతి ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టర్ రాపేటి శ్రీదేవి, గ్రామ నాయకులు హానిమన్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోమియోమందుల వల్ల ఎన్నో రోగాలను నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రావు, గోలి కృష్ణారావు, ఈటి వెంకటరావు, పైడా ప్రకాశరావు, ఈటి సత్యనారాయణ, అట్టా బ్రహ్మానందరావు, గుడివాడ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వణుకుడు వ్యాధి పురుషుల్లోనే ఎక్కువ

డాక్టర్ సీహెచ్.విజయ్

అక్కిరెడ్డిపాలెం: వణుకుడు వ్యాధి పురుషులకే ఎక్కువ వస్తుందని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సీహెచ్.విజయ్ అన్నారు. ఈ నెల 11న అంతర్జాతీయ పార్కిన్సన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆస్పత్రిలో వణుకుడు జబ్బుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ వ్యాధి వచ్చిన వారిలో చేతులు, తల వణకడంతో పాటు దృఢత్వం లోపిస్తుంది. సరిగ్గా నడవలేరని వివరించారు. 60 ఏళ్లు దాటిన వారిలో ఈ వ్యాధి కనిపిస్తుందన్నారు. లక్షణాలు కనిపించిన వారు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

స్టీల్‌ప్లాంట్ కేవీలో ఆ తరగతులు కొనసాగించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో ఒకటో తరగతి, 11వ తరగతులు కొనసాగించాలని విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను కోరారు. టీఎన్‌టీయుసి ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు, కేవీ పేరెంట్స్ కమిటీ ప్రతినిధి చిరంజీవి గురువారం ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. కేవీ తరగతుల కొనసాగింపుపై ఎంపీ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

సీపీఐ సభను జయప్రదం చేయండి

కూర్మన్నపాలెం: విశాఖ నగరంలో శుక్రవారం నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ గాజువాక సమితి సభ్యుడు జి. ఆనంద్ విజ్ఞప్తి చేశారు. ఈ సభకు సీపీఐ జాతీయ కార్యదర్శి పి.నారాయణ హాజరు కానున్నారని ఆయన తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్దకు సీపీఐ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వచ్చిన తర్వాత దేశం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని.. ధరల నియంత్రణలో విఫలం కావడం వంటి ఆయన విధానాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

స్ఫూర్తి.. దీప్తి

హోదా ఉన్న వాళ్లు ఈ రోజుల్లో సరదాలు.. వినోదాలకు సమయం కేటాయిస్తారు. ఆమె మాత్రం సామాజిక సేవలో భాగమయ్యారు. అభాగ్యులు, మహిళలు, దివ్యాంగులకు సేవ చేస్తున్నారు. ఉన్నంతలో వారికి చేయూత అందించి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆమే స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ కమాండెంట్ అతహర్ హనీఫ్ సతీమణి తబస్సుమ్ హనీఫ్ అతహర్.

- ఆర్భాటాలకు దూరం.. సేవలకు చేరువ
- మానవతావాది 'సంరక్షిక' తబస్సుమ్

ఉక్కునగరం: పలువురి మహిళలతో కలిసి పేద, బడుగు బాలలు, వృద్ధుల సంక్షేమం కోసం చేయూత కార్యక్రమాలు నిర్వహిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు స్టీల్‌ప్లాంట్ సంరక్షిక అధ్యక్షురాలు తబస్సుమ్ హనీఫ్ అతహర్. స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్ ఏర్పాటు నుంచి సీఐఎస్ఎఫ్ సిబ్బంది సతీమణుల సాధికారిత మరియు సంక్షేమం కోసం' సంరక్షిక ' అసోసియేషన్ ఏర్పాటైంది. ఈ అసోసియేషన్‌కు ప్రత్యేక నిధులు లేకపోవడంతో ఇంతకు ముందు అప్పుడప్పుడూ కార్యక్రమాలు నిర్వహించేవారు.


బధిర బాలునికి చెవిటి మిషన్ అమరిక


మహిళల కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు


వృద్ధాశ్రమంలో..

మహిళలు సంఘటితం

కాలనీలోని మహిళలను సంఘటిత పరిచారు. సమాజంలో జీవిస్తున్న పేద వర్గాలకు సాయం చేయాలనే దృక్పథాన్ని వారిలో తీసుకువచ్చారు. ఇందులో భాగంగా మహిళలను భాగస్వాములను చేసి ప్రతీ నెలా కొంత మందికి నిత్యావసర వస్తువులు అందజేస్తున్నారు.

2022 నుంచి సంక్షేమ కార్యక్రమాలు విస్తృతం

2022లో తబస్సుమ్ సంరక్షిక అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సంక్షేమ కార్యక్రమాలు ఊపందుకున్నాయి. సీఐఎస్ఎఫ్ యూనిట్ కార్యాలయానికి సమీపంలోని సీఐఎస్ఎఫ్ కాలనీలో సుమారు 750 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది క్వార్టర్లు ఉన్నాయి. కాలనీ వాసులు కాయగూరల కోసం దూరంగా ఉండే ట్రేవీక్లీ మార్కెట్‌కు నడిచి వెళ్తుండేవారు. వారి ఇబ్బందులు గమనించిన తబస్సుమ్ కాలనీలోనే కాయగూరల మార్కెట్ ఏర్పాటు చేశారు. మహిళలు, బాలల ఆరోగ్యం కోసం కాలనీలో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సహకారంతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయించారు.

ఆర్భాటాలకు దూరంగా..

ఆమెతో పాటు పిల్లల పుట్టిన రోజు నాడు ఆర్భాటాలతో అనవసరపు వ్యయం చేయకుండా అనాథ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలకు వెళ్లి వారికి భోజనం ఏర్పాటు చేయడం.. అవసరమైన నిత్యావసర సరకులు అందజేస్తున్నారు. ఈ విధంగా చేయడం ద్వారా పిల్లల్లో చిన్ననాటి నుంచే సామాజిక సేవపై అవగాహన పెరుగుతుందని చెబుతున్నారు తబస్సుమ్.

చిన్నారులకు ఆసరాగా..

అదే విధంగా రహదారులు, సిగ్నల్స్ వద్ద చిన్న పిల్లలతో బిచ్చమెత్తుకునే గ్యాంగ్‌ల నుంచి పిల్లలను రక్షించేందుకు పలు ప్రభుత్వ, ఎన్జీవోలతో చేతులు కలిపి పని చేశారు. అటువంటి మహిళలు, పిల్లలను వసతి గృహాలు, అనాథ ఆశ్రమాల్లో చేర్పించారు. మహిళా దినోత్సవం, బాలల దినోత్సవం సందర్భంగా ఆయా అనాథ ఆశ్రమాలు, వసతి గృహాలకు వెళ్లి సొంత నిధులతో బియ్యం, పప్పులు, నూనె, స్టేషనరీ సామగ్రి అందజేస్తున్నారు.

మతాలకు అతీతంగా వేడుకలు

ఆమె ముస్లిం అయినప్పటికీ మతాలు ఎన్ని ఉన్నా దేవుడు ఒక్కడే అని నమ్ముతారు. సీఐఎస్ఎఫ్ కాలనీలో సంక్రాంతి, హోలీ, కృష్ణాష్టమి, వినాయక చవితి, దీపావళి పండగలను దగ్గరుండి జరిపిస్తుంటారు. నిత్యం ఇంటి పనుల్లో ఒత్తిడితో ఉండే మహిళలకు, పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు ప్రత్యేకంగా ఆట, పాటలు నిర్వహించడంతో పాటు సమీప ప్రాంతాలకు పిక్నిక్‌లు, ట్రెక్కింగ్‌లకు తీసుకు వెళ్లడం ద్వారా వారు సేద తీరేలా చేశారు. అచేతనంగా ఉన్న సంరక్షికను ఒక స్థాయికి తీసుకెళ్లారు. ఇలాంటి తరుణంలో అతహర్ మహ్మద్ హనీఫ్‌కు భిలాయ్ బదిలీ కావడంతో మహిళలు ఆమె సేవలను గుర్తు చేసుకుంటున్నారు.

విరివిగా వితరణలు

గతేడాది బాలల దినోత్సవం సందర్భంగా అచ్యుతాపురంలోని విభిన్న ప్రతిభావంతుల ఆశ్రమాన్ని సందర్శించి వారికి రూ. 60 వేలు విలువైన నిత్యావసర వస్తువులు, స్వీట్లు అందజేశారు. ఆ సమయంలో అక్కడ కార్తీక్ అనే 12 ఏళ్ల బాలుడు ఎవరితో మాట్లాడకుండా మూలన కూర్చొని ఉండడాన్ని గమనించిన తబస్సుమ్ ఆశ్రమ నిర్వాహకులను ఆ బాలుడి గురించి ఆరా తీశారు. ఆ అబ్బాయికి చెవుడు అని చెప్పడంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అనేక పరీక్షలు చేయించి తన సొంత నిధులతో చెవిటి పరికరం కొని అమర్చారు. అదే విధంగా ఉక్కునగరంలోని అరుణోదయ ప్రత్యేక పాఠశాలలో ఆ బాలుడిని ప్రత్యేక పర్మిషన్‌తో చేర్పించారు.

సమాజం పట్ల బాధ్యత అవసరం...

మనకి డబ్బు ఉంది ..మన కార్యక్రమాలు ఘనంగా చేసుకుంటాం. మరి పేదవారి పరిస్థితి ఏంటి. వారు కుటుంబాన్ని ఎలా పోషిస్తారు. వారి పిల్లలకు పుట్టిన రోజులు ఎలా చేస్తారు. మన విలాసాలు తగ్గించుకుని పేద, బడుగు వర్గాల ఆకాంక్షలు తీరిస్తే వారు ఆనందంగా ఉంటారు. మన జన్మకు సార్థకత లభిస్తుంది. ప్రతీ ఒక్కరూ సమాజం పట్ల బాధ్యత తీసుకుంటే దేశం ఎంతో బాగుంటుంది.

– తబస్సుమ్ హనీఫ్ అతహర్
అధ్యక్షురాలు, సంరక్షిక



కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెను విరమించుకోండి

కార్మిక సంఘాలను కోరిన యాజమాన్యం


కార్మిక సంఘాలతో సమావేశమైన స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ ఉన్నతాధికారులు

ఉక్కునగరం: కాంట్రాక్ట్ కార్మికుల నిరవధిక సమ్మెను విరమించుకోవాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులను కోరింది. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈ నెల 16 నుంచి నిరవధిక సమ్మెకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో గురువారం యాజమాన్యం నుంచి హెచ్ఆర్ ఉన్నతాధికారులు ఎం. మధుసూదనరావు, ఎన్. భాను కార్మిక సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ కార్మికులను తొలగించడానికి వీల్లేదన్నారు. తొలగించిన 1500 మందిని మూడు నెలల్లోగా తీసుకుంటామని హామీ ఇస్తే సమ్మె ఉపసంహరించుకుంటామని తెలిపారు. దీనిపై యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల తగ్గింపు అంశంపై మంత్రిత్వశాఖ ఆదేశాలు పాటించడం తమ బాధ్యత అన్నారు. ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకతలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను ఉపసంహరించుకోవాలని కోరారు. సమావేశంలో హెచ్ఆర్ మేనేజర్ శంకర్, వివిధ కార్మిక సంఘాల నాయకులు నీరుకొండ రామచంద్రరావు, వంశీ, కె.ఎం. శ్రీనివాసరావు, నమ్మి రమణ, సోంబాబు, అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో పీడీ పోస్టులు కొనసాగించాలి

అగనంపూడి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పెనుమార్పులు తీసుకువస్తామని ప్రకటిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను రద్దు చేయడానికి ఉపక్రమించడం అన్యాయమని అనకాపల్లి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చిలికి వెంకటరావు, కె.ఎం.నాయుడు అన్నారు.లంకెలపాలెం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గురువారం వారు మాట్లాడారు. కరోనా తరువాత విద్యార్థుల మానసిక స్థితిలో విపరీతమైన మార్పులు చోటుచేసుకున్నాయని, ఈ పరిస్థితుల్లో విద్యార్థుల మానసిక స్థితి గతుల్లో మార్పులు తీసుకురావడానికి వ్యాయామ విద్య అవసరం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 ఫిజికల్ డైరెక్టర్ ఖాళీలను వేరే సబ్జెక్టులకు మార్పు చేస్తూ నిర్ణయం తీసుకోవడం సరైనది కాదన్నారు. వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జాతరమ్మ జాతర... బొర్రమాంబ జాతర


బొర్రమాంబకు పూజలు చేస్తున్న గాజువాక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి దంపతులు


పసుపు నీళ్లతో మహిళలు

ఘనంగా పుట్ట బంగారు మహోత్సవం

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల్లోని అగనంపూడి, అష్ట గ్రామాల ఇలవేల్పు బొర్రమాంబ జాతరలో భాగంగా గురువారం పుట్ట బంగారు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అగనంపూడి పరిసర నిర్వాసితకాలనీల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారి పుట్ట బంగారం ఊరేగింపులో పాల్గొన్నారు. ముందుగా వనంలో ఉన్న అమ్మవారి విగ్రహానికి గాజువాక ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి యార్లగడ్డ శ్రీలక్ష్మి దంపతులు పూజలు చేశారు. తర్వాత అమ్మవారి విగ్రహం వద్ద పుట్ట బంగారాన్ని తీసుకొని భక్తులు తరలిరాగా సుమారు కిలోమీటరు దారి పొడవునా భక్తులు పసుపు నీళ్ల బిందెలతో అమ్మవారికి ఎదురేగి ఊరేగింపు మార్గాన్ని శుభ్రం చేస్తూ పూజలు చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ చిత్తా గణేష్, ఉత్సవ కమిటీల నేతృత్వంలో అమ్మవారి ఊరేగింపు భారీగా సాగింది.

ర్యాపిడో డ్రైవర్‌ను బెదిరించి దోపిడీ

ఉక్కునగరం: ర్యాపిడో డ్రైవర్‌ను నిలువు దోపిడీ చేసిన సంఘటన బుధవారం రాత్రి స్టీల్‌ప్లాంట్ ప్రాంతంలో జరిగింది. గాజువాక క్రైం ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా... రాజీవ్‌నగర్‌కు చెందిన టి. కిశోర్ ఫార్మా కంపెనీలో పని చేస్తున్నాడు. పార్ట్‌టైంగా ర్యాపిడో బైకర్‌గా వెళ్తున్నాడు. బుధవారం రాత్రి ర్యాపిడో పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా శ్రీనగర్ బంక్ వద్ద ఒక మైనర్ స్టీల్‌ప్లాంట్‌లో దింపితే డబ్బు లిస్తానని తెలిపాడు. దీంతో కిశోర్ మైనర్‌ను బండిపై ఎక్కించుకుని స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ రోడ్‌లో వెళ్తున్నాడు. పోలీస్ స్టేషన్ సమీపంలోని శ్మశానవాటిక వద్ద బైక్ ఆపాలని మైనర్ కోరాడు. కిశోర్ బండి ఆపడంతో మైనర్ బండి దిగి తాళాలు లాక్కుని డబ్బులివ్వాలని డిమాండ్ చేశాడు. దీనికి కిశోర్ నిరాకరించడంతో మొహంపై పిడి గుద్దులు గుద్ది జేబులో ఉన్న ఫోన్ లాక్కున్నాడు. డబ్బులు లేవని చెప్పడంతో ఫోన్ లాక్ తీయించి ముగ్గురు వ్యక్తులకు రూ. 45 వేలు, రూ. 2500, రూ. 600 ట్రాన్స్‌ఫర్ చేయించిన తర్వాత మైనర్ అక్కడ నుంచి పరారయ్యాడు. కిశోర్ తన సోదరుడి సాయంతో పోలీసులను ఆశ్రయించాడు. గాజువాక క్రైం ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు రంగంలో దిగి సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా ఆ మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతను ఫోన్‌పే చేసిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని నగదు రికవరీ చేశారు.


సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న క్రైం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

కాలువలు ఇలా.. మురుగు పోయేదెలా?


శాతవాహన నగర్ కాలనీలో శిథిలమైన కాలువ


అస్తవ్యస్తంగా రోడ్డు నంబర్ 3 కాలువ

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డులో మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. శాతవాహననగర్‌లో పూర్తిగా శిథిలమయ్యాయి. ఇప్పటికే అనేక సార్లు అధికారులకు వినతి పత్రాలు అందించా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కాలువకు గోడలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్డు పైకి వచ్చేస్తుంది. దీని వల్ల సాయంత్రం వేళ స్కూల్ పిల్లలు నానా ఇబ్బందులు పడుతున్నారు. విపరీతమైన దుర్వాసన వెదజల్లుతుండడం వల్ల రోగాల బారిన పడాల్సి వస్తుందని చెబుతున్నారు. తక్షణమే అధికారులు కాలువల నిర్మాణంపై దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు వాడపల్లి రామచంద్రరాజు డిమాండ్ చేశారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు


బాలుడిని అప్పగిస్తున్న న్యూపోర్టు పోలీసులు

పెదగంట్యాడ: తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు న్యూపోర్టు పోలీసులు గురువారం అప్పగించారు. న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు తెలిపిన వివరాలు.. మండలంలోని నడుపూరుకు చెందిన గొందేశి కీర్తనసాయి (4) నడుపూరు గ్రౌండ్ నుంచి ముసలినాయుడు పాలెం వెళ్లిపోయాడు. అక్కడ రోడ్డుపై నిలబడి ఏడుస్తుండగా బ్లూకోర్టు కానిస్టేబుల్ అశోక్ ఆ బాబును న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లాడు. స్పందించిన సీఐ వెంటనే ఆ బాలుడి ఫొటోను సోషల్ మీడియాలో పెట్టారు. దీంతో బాలుడి తాత పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. తన కుమార్తెకు కుమారుడని చెప్పడంతో వివరాలు నమోదు చేసుకొని ఆ బాలుడిని అతనికి అప్పగించారు.

బైపీసీ గ్రూపు పెట్టాలని వినతి

అగనంపూడి: పేద పిల్లలు చదువుకుంటున్న అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ గ్రూపునకు అనుమతులు వచ్చేలా చొరవ తీసుకోవాలని అగనంపూడికి చెందిన నాయకులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కోరారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో గురువారం కలిసి కళాశాలలో సమస్యలను వివరించారు. ఒకేషనల్ అధ్యాపకులను నియమించాలని, పూర్తిస్థాయి ప్రిన్సిపాల్‌ను నియమించాలని, కళాశాలకు సోలార్ విద్యుత్ యూనిట్ను మంజూరు చేయాలని కోరారు. అలాగే మెట్రోల్ రైల్ మార్గాన్ని కూర్మన్నపాలెం నుంచి లంకెలపాలెం వరకు పొడిగించాలని నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, గొల్లవిల్లి వెంకటరావు, బండారు చందు విన్నవించారు.

ఘనంగా జాతీయ సర్వే దినోత్సవం

మహారాణిపేట: రీ సర్వే కార్యక్రమంలో సర్వేయర్లు చురుగ్గా పాల్గొంటున్నారని ఆంధ్రప్రదేశ్ సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంపాన కనక బాబు అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో ఉన్న విశాఖ జిల్లా ఆంధ్రప్రదేశ్ సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ విశాఖ జిల్లా కార్యాలయంలో ఘనంగా జాతీయ సర్వే దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రామ సర్వే అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కనకబాబు మాట్లాడుతూ సర్వేయర్లను అభినందించారు. సర్వేకు సహకరిస్తున్న ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్లు విజయకుమార్, సూర్యారావు తదితరులు అందించిన సహకారాన్ని కనకబాబు కొనియాడారు. సర్వేయర్లు పైడిరాజు, కృష్ణారావు, రమేష్, హరీష్, లీల, వెంకటేశ్వరరావు, సూర్య భగవాన్, శివాజీ, రామకృష్ణ, రాజగోపాల్, రమేష్, శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లా అధ్యక్షుడు కనకబాబును సన్మానిస్తున్న సర్వేయర్లు

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరించిన ముగ్గురి అరెస్ట్

అక్కిరెడ్డిపాలెం: వేకువ జామున పూలు కోస్తున్న మహిళ మెడలో బంగారు గొలుసు తెంపుకొని పోయిన ముగ్గురిని గాజువాక క్రైం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. క్రైం ఎస్ఐ మన్మథరావు తెలిపిన వివరాలిలా.. మార్చి 28న ఉదయం 5 గంటల సమయంలో బందల లక్ష్మి తన నివాసం సమీపంలో పూలు కోస్తుండగా బైక్‌పై ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు.

బైక్‌ను మహిళకు కొంచెం దూరంలో పార్క్ చేసిన తర్వాత ఒక వ్యక్తి మహిళకు చేరువగా తచ్చాడగా.. మిగిలిన ఇద్దరు హఠాత్తుగా మహిళ వద్దకు చేరుకొని ఆమె మెడలోని బంగారు చైను తెంపుకుని బైక్‌పై పరారయ్యారు. వెంటనే బాధిత మహిళ గాజువాక క్రైం పోలీసుకు ఫిర్యాదు చేసింది. దీంతో క్రైం డీసీపీ కె.లతా మాధురి, ఏడీసీపీ మోహనరావు పర్యవేక్షణలో క్రైం ఏసీపీ జోన్ 2 డి.లక్ష్మణరావు, సౌత్ సబ్ డివిజన్ క్రైం ఇన్స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్.మన్మథరావుతో ప్రత్యేక టీం ఏర్పాటు చేసి దర్యాప్తు చేశారు. ఆటోనగర్ ఆర్చి అక్కయ్యపాలెం సంఘం ఆఫీసు ప్రాంతానికి చెందిన ఈర్ల వినయ్ కుమార్, ఎస్‌వీపీ నగర్, కొబ్బరి తోటకు చెందిన కిల్లి తరుణ్ కుమార్, ఇదే ప్రాంతానికి చెందిన సీకు కిషోర్‌లను అరెస్ట్ చేసి వారి నుంచి పల్సర్ బైక్‌తో పాటు రూ.1,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరు చెడుఅవాట్లు, లగ్జరీ లైఫ్‌కు అలవాటి పడి శులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చైన్ స్నాచింగ్ చేశారని ఎస్ఐ తెలిపారు.

వీధికుక్కల బెడద తగ్గించాలి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు షీలానగర్‌లోని పలు కాలనీల్లో వీధి కుక్కల బెడదతో పాటు సౌండ్ పొల్యూషన్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఐద్వా, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రికి గురువారం వినతిపత్రం అందజేశారు. కాలనీల్లో వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ పాదచారులు, చిన్న పిల్లలపై దాడులు చేస్తున్నాయని వివరించారు. ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారి వెంటపడడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. సీనియర్ సిటిజన్స్ వేకువ జామున వాకింగ్‌కు వెళ్లాలంటే కుక్కలతో భయపడుతున్నారన్నారు. రాత్రివేళ గుంపులుగా ఒకదానిపై ఒకటి దాడులు చేసుకుంటూ అరుపులతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని తెలిపారు. ఆటోల్లో వివిధ రకాల అమ్మకాలు చేపట్టే వారు మైక్‌లతో సౌండ్ పొల్యూషన్‌కు కారణమవుతున్నారని వివరించారు. వీటిపై తగు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, జి.మణి, వందన, విన్ని, ఆదిలక్ష్మి, అసోసియేషన్ ప్రతినిధులు పి.ఎస్.ఎన్.రాజు, ఎస్.సత్యారావు, ఎన్.వి.రావు, సీపీఎం నాయకులు ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


జెడ్సీ శేషాద్రికి వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు

ఎన్నికల విధుల పారితోషికం కోరుతూ ధర్నా

జగదాంబ: ఎన్నికల విధులు నిర్వర్తించిన తమకు పారితోషికం చెల్లించాలని కోరుతూ జోన్-4 కార్యాలయంలో సూపర్‌వైజర్లు గురువారం ధర్నా నిర్వహించారు. 24 మంది ఎన్నికల్లో సూపర్‌వైజర్లుగా విధులు నిర్వర్తించినట్లు తెలిపారు. ఒక్కొక్క సూపర్‌వైజర్‌కు రూ. 48 వేలకు పైగా పారితోషికం వస్తుందన్నారు. ఐదేళ్లు అవుతున్నా తమకు రావాల్సిన నగదు రాలేదన్నారు.


జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సూపర్‌వైజర్లు